క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే పాదయాత్ర

మోతీనగర్: కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మంగళవారం అల్లాపూర్ డివిజన్‌లో పాదయాత్ర ఉంటుందని కార్పొరేటర్ సబిహా బేగం తెలిపారు. మధ్యాహ్నం 3గంటలకు కొత్తూరు సీతయ్యనగర్, రాణాప్రతాప్‌నగర్, శివాజీనగర్, రాధాకృష్ణనగర్, గణేష్ నగర్, న్యూ రామారావు నగర్, వి.రామారావు నగర్, హరినగర్‌లలో పర్యటిస్తారని పేర్కొన్నారు. రైల్వే అండర్ పాస్ కేఎస్‌నగర్ జెండా వద్ద నుంచి కేఎస్‌నగర్‌లోకి ప్రవేశిస్తారన్నారు. ఈ పాదయాత్రలో బస్తీ, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు, నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ



భూమి పూజలో కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ తదితరులు

ఓల్డ్‌బోయిన్‌పల్లి: డివిజన్ పరిధిలోని వల్లభ్‌నగర్‌లో ఉన్న కాళీమాతా ఆలయ నిర్మాణానికి సోమవారం కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్ భూమిపూజ చేశారు. ఆలయ నిర్మాణానికి ముందుకొచ్చిన దాతలను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో నరేందర్‌గౌడ్, బల్వంత్‌రెడ్డి, విజయకుమార్, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభం

బాలానగర్: బాలానగర్‌లో డీసీసీ మేడ్చల్–మల్కాజ్‌గిరి డిస్ట్రిక్ట్ జనరల్ సెక్రటరీ మైనార్టీస్ డిపార్టుమెంట్ మహమ్మద్ అబ్దుల్ సమీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ఏర్పాటు చేవారు. ముఖ్యఅతిథిగా టీపీసీసీ సభ్యుడు గొట్టిముక్కల వెంగళరావు పాల్గొని సోమవారం కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీస్ చైర్మన్ షేక్ అబ్దుల్లా సోహేల్, బీ-బ్లాక్ ప్రెసిడెంట్ రాఘవేంద్ర, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే గాంధీ

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని పలువురికి 11 లక్షల 62 వేల రూపాయల విలువ చేసే సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ సోమవారం లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సంజీవరెడ్డి, రాజు నాయక్, కొండా విజయ్, తిరుపతిరెడ్డి, ప్రసాద్, జనార్దన్, బాబు మోహన్, మల్లేష్, శ్రావణిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వరద నీటి డ్రెయిన్ పనుల పరిశీలన



జలవాయువిహార్‌లో పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని జలవాయువిహార్ కాలనీలో చేపడుతున్న వరద నీటి డ్రెయిన్ నిర్మాణ పనులను సోమవారం కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనులను నాణ్యతతో చేపట్టాలని సూచించారు. పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ మహదేవ్, డివిజన్ ఉపాధ్యక్షుడు పోతుల రాజేందర్, కాలనీవాసులు వివేక్, యుఆర్‌కె ప్రసాద్, విఠల్, పీవీ రావు, వర్మ, శ్రీనివాస్, కృష్ణన్, మునికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల్లో కార్పొరేటర్ పర్యటన

ఓల్డ్ బోయిన్‌పల్లి: వర్షం నీరు నిలిచే ప్రాంతాలలో జీహెచ్‌ఎంసీ అధికారులతో కలసి సోమవారం కార్పొరేటర్ ముద్దం నర్సింహాయాదవ్ పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులను అక్కడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా అలీ కాంప్లెక్స్ వెనుక వైపు వర్షపునీరు నిలుస్తోందని స్థానికులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే సంబంధిత అధికారులకు సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఈ బాలకృష్ణ, ఏఈ అరవింద్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్, నాయకులు సయ్యద్ ఏజాజ్, ఇబ్బు కాలనీవాసులు పాల్గొన్నారు.



56శాతం ఉన్న బీసీలకు
75ఏళ్లుగా రిజర్వేషన్లు లేవు



మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య



కూకట్‌పల్లి బీసీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో జరిగిన బీసీ ఆత్మీయ సమ్మేళనంలో అభివాదం చేస్తున్న బీసీ నాయకులు

- బీసీ ఆత్మీయ సమ్మేళనంలో ఆర్.కృష్ణయ్య
- నీది ఏ కులమంటే బీసీ కులమని చెప్పాలని వ్యాఖ్య
- తెగించి పోరాడితేనే చట్టసభల్లో బీసీల రిజర్వేషన్ సాధ్యం
- బీసీలు యాచించే స్థాయి నుంచి శాసించే స్థాయికి ఎదగాలి: వి.ప్రకాష్

మూసాపేట: భారతదేశాన్ని ఓ రాజయోగి పరిపాలిస్తున్నాడని.. ప్రధాని మోదీ ఓ రాజయోగి అని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. సోమవారం మూసాపేటలోని ఆంజనేయ నగర్‌లోని సీతారామ కల్యాణ మండపంలో కూకట్‌పల్లి బీసీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో బీసీ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్.కృష్ణయ్య పాల్గొని ప్రసంగించారు. చట్టసభలలో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని ప్రధాని మోదీని కోరానన్నారు. చట్ట సభలలో బీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తే మరో అంబేడ్కర్ అవుతారని ప్రధానికి తెలిపానన్నారు. భారతదేశంలో ఒక తల్లి బిడ్డలకు సమాన వాటా పంచినప్పుడు బీసీలకు సమాన వాటా ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. 56 శాతం ఉన్న బీసీలకు 75 ఏళ్లుగా రిజర్వేషన్ కల్పించటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

బీసీ అనే కులం కోసం పోరాడటం నా అదృష్టం..

అన్ని అర్హతలు ఉన్నా చట్ట సభలకు వెళ్లలేక పోవడానికి కారణం బీసీలుగా పుట్టడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి చట్టసభల్లో రిజర్వేషన్ కల్పించటమే తమ లక్ష్యమన్నారు. రాజ్యాధికారం దిశగా బీసీలంతా ఐక్యంగా పోరాటం చేయాలని కోరారు. బీసీలందరూ ఐక్యంతో సమష్టిగా ముందుకు సాగాలన్నారు. బీసీ కులాల్లో వైరం పెట్టి పాలించే ప్రయత్నాలు అగ్రకులాలు చేస్తున్నాయని దీనిని బీసీలంతా గమనించాలన్నారు. నీది ఏ కులమంటే బీసీ కులమని చెప్పాలని తెలిపారు. మర్యాదగా చెబితే ఎవరూ వినరని... పోరాటం, ఉద్యమంతోనే మన కల సాధ్యమతుందన్నారు. తెగించి పోరాటం చేయకపోతే ఏదీ సాధ్యం కాదని స్పష్టం చేశారు. బీసీగా పుట్టి బీసీ అనే కులం కోసం పోరాటం చేయటం తన అదృష్టమన్నారు. పోరాటాలతోనే బీసీ హాస్టల్స్, గురుకులాలు, స్కాలర్‌షిప్‌లు సాధించామని గుర్తు చేశారు.

బీసీల్లో చైతన్యం రావాలి: వి.ప్రకాష్

నీటి వనరుల అభివృద్ధి శాఖ చైర్మన్ వి. ప్రకాష్ మాట్లాడుతూ... బీసీ కులాలు ఏకతాటిపైకి వచ్చి ఐక్యంగా పోరాడాలన్నారు. బీసీ కులాల్లో చైతన్యం రావాలన్నారు. ఏ పార్టీలో ఉన్నా బీసీలను కలుపుకొని పోవాలని సూచించారు. 2028 నాటికి ఎవరిని టికెట్ అడక్కుండా బీసీ పార్టీ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. యాచించే స్థాయి నుంచి శాసించే స్థాయికి ఎదగాలన్నారు.

బీసీలకు ఆత్మనూన్యతా భావం ఉండొద్దు: రాజకీయ విశ్లేషకులు విఠల్

అనంతరం రాజకీయ విశ్లేషకులు విఠల్ మాట్లాడుతూ బీసీలకు ఆత్మనూన్యతా భావం ఉండొద్దన్నారు. చరిత్రలో పాలకులు బీసీలే అని అన్నారు. చరిత్ర తెలుసుకోకపోతే ఆత్మ విశ్వాసం రాదన్నారు. బీసీలంటే భారతదేశ కమాండర్స్ అని, తెలంగాణ ఉద్యమంలో పునాదులు వేసింది బీసీ నాయకులే అని గుర్తు చేశారు. బీసీలలో ఎవరికి టిక్కెట్ వచ్చినా బీసీలోని అన్ని కులాల వారు గెలిపించుకోవాలన్నారు.

◆ ఈ కార్యక్రమంలో నిర్వాహకులు బీసీ ఐక్య వేదిక కన్వీనర్ బాశెట్టి నర్సింగ్‌రావు, గున్నాల వినోద్ కుమార్, తూము సంతోష్, బింగి రాములు, కార్పొరేటర్ మహేందర్, మాజీ సర్పంచ్ తూము శ్రీనివాస్, విద్యా వెంకట్, అర్సవల్లి విజయ్‌చంద్ర, గోపిశెట్టి రాఘవేందర్, ప్రేమ్‌కుమార్, పద్మయ్య, శేఖర్‌గౌడ్, తూము శైలేష్ కుమార్, మనోహర్, తూము సాగర్ పటేల్, మల్లేష్, సత్యనారాయణ గౌడ్, ఉమాకాంత్, ఎల్లారావు, తదితరులు పాల్గొన్నారు.

డివిజన్‌లో 90 శాతం అభివృద్ధి పనులు పూర్తి



ఎల్లమ్మబండలో పర్యటిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: డివిజన్‌లో ఇప్పటికే 90 శాతం అభివృద్ధి పనులు పూర్తి చేశామని ఆల్విన్‌కాలనీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ తెలిపారు. సోమవారం డివిజన్ పరిధిలోని అంబేద్కర్‌నగర్, సుభాష్‌చంద్రబోస్ కాలనీ, మహాత్మాగాంధీ నగర్, గణేష్‌నగర్, తారకరామ్‌నగర్ కాలనీల్లో జీహెచ్‌యంసీ అధికారులు, స్థానికులతో కలిసి పాదయాత్ర చేస్తూ ఇంటింటికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీల్లో కొంత పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ, సీసీ రోడ్ల పనులను కూడా త్వరలో పూర్తి చేస్తామన్నారు. మ్యాన్‌హోల్స్ మూతలు, విద్యుత్ దీపాలు, విద్యుత్ వైర్లు వంటి చిన్న సమస్యలను స్థానికులు తన దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. వాటిని సంబంధిత అధికారులకు తెలియజేసి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఎల్లమ్మబండలోని ప్రభుత్వ ఆస్పత్రిని, అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. రోగులు, వారి బంధువులతో మాట్లాడి అక్కడ అందుతున్న సేవలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు, వాటర్ వర్క్స్ రవీందర్‌రెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, ఎంటమాలజీ సూపర్‌వైజర్ డి. నరసింహులు, లైన్‌మెన్ నరసింగరావు, ఎస్‌ఎఫ్‌ఎ మల్లేష్, నాయకులు రామకృష్ణగౌడ్ సమ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు విశ్వగురు వరల్డ్ రికార్డు పురస్కారాలు



ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులను అందజేస్తున్న లయన్ డాక్టర్ సత్యవోలు రాంబాబు

కూకట్‌పల్లి: తమ వృత్తిని కొనసాగిస్తూ అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన ఉత్తమ ఉపాధ్యాయులకు అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో విశ్వగురు వరల్డ్ రికార్డు అవార్డులు అందించారు. సోమవారం కూకట్‌పల్లి భారత్ వికాస్ పరిషత్‌లో జరిగిన గురు పూజోత్సవంలో ఈ పురస్కారాలను అందజేశారు. విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ సీఈఓ లయన్ డాక్టర్ సత్యవోలు రాంబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రిటైర్డ్ జిల్లా జడ్జి నేరెళ్ల మాల్యాద్రి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగిస్తూ ఉపాధ్యాయ వృత్తి అత్యంత పవిత్రమైందన్నారు. సమాజాన్ని తీర్చిదిద్ది దేశాభివృద్ధికి దోహదపడేది ఉపాధ్యాయులే అని కొనియాడారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కె. ధర్మారెడ్డి గౌరవ అతిథిగా పాల్గొన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చి ఉపాధ్యాయులు డా. భవాని, డా. సారంగపాణి, కె. యాదయ్య గౌడ్, డా. వెంకటేశ్వరరావు, వెంకట సత్యనారాయణ, ఆముద, స్వప్న, జి. శ్రీనివాస్, నరేంద్ర బాబు, సంగీత, జాఫర్, రాజు సాగర్‌లు అవార్డులు అందుకున్నారు.

మార్పు కోసం బీజేపీ పాదయాత్ర



పాదయాత్రలో పాల్గొన్న బీజేపీ నాయకులు సురభి రవీందర్‌రావు, స్రవంతి

ఆల్విన్‌కాలనీ: మార్పు కోసం బీజేపీ పాదయాత్ర సోమవారం ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ చౌరస్తా నుంచి ప్రారంభయ్యింది. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సురభి రవీందర్‌రావు నేతృత్వంలో డివిజన్ అధ్యక్షుడు కమలాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో పాదయాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా రవీందర్‌రావు, మహిళా మోర్చ జిల్లా ఉపాధ్యక్షురాలు స్రవంతి, రవీందర్‌రావు మాట్లాడుతూ.. మార్పు కోసం బీజేపీ అనే నినాదం ద్వారా ప్రజల మధ్యకు వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకుంటున్నామని అన్నారు. రూ.9వేల కోట్లతో ఎమ్మెల్యే ఎక్కడ అభివృద్ధి చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు నరేందర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు రామరాజు, బీజేవైఎం నేషనల్ ఆఫీస్ కోఆర్డినేటర్ కుమార్ యాదవ్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

జగద్గిరిగుట్ట: విద్యుత్ మరమ్మతుల కారణంగా మంగళవారం సబ్‌స్టేషన్ పరిధి గాంధీనగర్ ఫీడర్‌లోని చింతల్, రంగానగర్, చంద్రానగర్, సాయికాలనీలలో ఉదయం 10 నుంచి 12గంటల వరకు..

◆ మగ్దూంనగర్, శ్రీనివాస్‌నగర్ ఫీడర్ల పరిధిలోని మగ్దూంనగర్, సీసాబస్తీ, పాలాల బస్తీ, రింగ్‌బస్తీ, శ్రీనివాస్‌నగర్, లెనిన్‌నగర్‌లలో మధ్యాహ్నం 1.30గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈఈ రాధాకిషన్ ఓ ప్రకటనలో తెలిపారు.

ట్రిపుల్ ఐటీ ప్రొఫెసర్లకు అరుదైన అవకాశం

రాయదుర్గం: ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు ప్రొఫెసర్లకు అరుదైన అవకాశం లభించింది. ప్రొఫెసర్ మాధవకృష్ణ ఇండియన్ నేషనల్ అకాడమీ ఆఫ్ ఇంజనీరింగ్(ఐఎన్ఏఈ) ఫెలోగా ఎంపికయ్యారు. ఇంజనీరింగ్ రంగంలో ముఖ్యంగా టెక్నాలజీలో వస్తున్న మార్పులపై ఆయనకున్న అవగాహన, అనుభవాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రొఫెసర్ మాధవ కృష్ణను ఎంపిక చేశారు.

ప్రొఫెసర్ కిషోర్‌కు డా.కలామ్ అవార్డు

ట్రిపుల్‌ఐటీ ప్రొఫెసర్ కిషోర్ కొత్తపల్లికి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలామ్ హెచ్‌పీసీ అవార్డు–2023కి ఎంపికయ్యారు.ముఖ్యంగా అల్గోరిథమ్ ఇంజనీరింగ్ టెక్నిక్స్ రంగంలో ఆయనకున్న ప్రతిభ, అనుభవాన్ని గుర్తించి ఆయనను ఈ అవార్డుకు ఎంపిక చేశారు. వీరిని పలువురు ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ ప్రొఫెసర్లు, అధ్యాపకులు అభినందించారు.

మట్టి గణేశ్ విగ్రహాల పంపిణీ



విగ్రహాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, ఫౌండేషన్ చైర్మన్ కొండ విజయ్

ఆల్విన్‌కాలనీ: వినాయక చవితిని పురస్కరించుకొని హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండా విజయ్ ఉచితంగా మట్టి గణేశ్ విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ సోమవారం విగ్రహాలను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. హోప్ ఫౌండేషన్ ఎనిమిదేళ్లుగా మట్టి విగ్రహాలను పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఈ సంవత్సరం 5వేల మట్టి విగ్రహాలను పంపిణీ చేయనున్నట్లు ఫౌండేషన్ చైర్మన్ కొండ విజయ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంజీవరెడ్డి, రాజు నాయక్, తిరుపతిరెడ్డి, ప్రసాద్, జనార్దన్, బాబు మోహన్, మల్లేష్, శ్రావణిరెడ్డి, నవాజ్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రామ్‌దేవ్‌రావ్ ఆస్పత్రిని సందర్శించిన వడ్డేపల్లి



వైద్యులతో మాట్లాడుతున్న వడ్డేపల్లి రాజేశ్వరరావు

కూకట్‌పల్లి: రాందేవ్‌రావ్ ఆస్పత్రిని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు సోమవారం సందర్శించారు. రాందేవ్‌రావ్ ఆస్పత్రిలో బ్లడ్ బ్యాంక్, డయాలసిస్ యూనిట్, ఐసీయూ, ఐ సెంటర్‌లో అందుతున్న సేవలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించారు. అనంతరం వైద్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావును శాలువాతో సత్కరించి ప్రాణ వాయువు మొక్కను బహూకరించారు. ఈ కార్యక్రమంలో సీఈఓ డాక్టర్ యోబు, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కమలాకర్ పాల్గొన్నారు.

హెచ్‌సీయూను సందర్శించిన ఇండోనేషియా బృందం



ఇండోనేషియా బృందానికి జ్ఞాపికను అందిస్తున్న వీసీ ప్రొఫెసర్ బీజేరావు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీని ఇండోనేషియా బోగోర్‌లోని ఐపీబీ విశ్వవిద్యాలయం ప్రతినిధి బృందం సోమవారం సందర్శించింది. ఇండోనేషియాలోని బోగోర్‌లోని ఐపీబీ యూనివర్సిటీకి చెందిన రీసెర్చ్ అండ్ ఇన్నొవేషన్ వైస్ రెక్టార్ ప్రొఫెసర్ ఎర్నాన్ రస్టియాడి, ప్లాంట్ ఎకాలోజిస్ట్, సైకాలజిస్ట్ ప్రొఫెసర్ ఎ డిసంతోషా, ఐకార్–క్రైడా లైజాన్ ఆఫీసర్ డాక్టర్ భరత్ కె ఆలమ్‌తో కూడిన బృందం వీసీ బీజేరావుతో సమావేశమయ్యారు. ముఖ్యంగా రెండు సంస్థల మధ్య సహకారంపై చర్చించారు. వీసీ ప్రొఫెసర్ బీజేరావు మాట్లాడుతూ సంస్కృతి వారసత్వం, చరిత్రకు సంబంధించి దేశాల మధ్య ఉన్న సారుప్యతలను వివరించారు. విద్యార్థులు, అధ్యాపకులకు ప్రయోజనం చేకూర్చే విధంగా రెండు విశ్వవిద్యాలయాల మధ్య సహకారాన్ని విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. ఐపీబీ విశ్వవిద్యాలయం ప్రతినిధుల బృందం మాట్లాడుతూ ఇండోనేషియాలో ఐపీబీ విశ్వవిద్యాలయం అతిపెద్ద మొదటి వ్యవసాయ విశ్వవిద్యాలయమని పేర్కొన్నారు. స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ ఎస్ శివకుమార్, ప్లాంట్ సైన్సెస్ విభాగాధిపతి ప్రొ.రాజగోపాల్, ఐఓఈ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘనశ్యామ్ కృష్ణ, ఆర్ అండ్ డీ సెల్ డైరెక్టర్ సామ్రాట్ ఎల్ సబత్, ఓఐఏ అసోసియేట్ డైరెక్టర్, స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ ఫ్యాకల్టీ ప్రొఫెసర్ అలోక్ కుమార్ మిశ్రా పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

- ఇన్సిడెంట్ ఫ్రీగా చవితి వేడుకలు చేసుకోవాలి
- సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర



రాయదుర్గం: గణేష్ వేడుకల్లో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర సూచించారు. రానున్న గణేష్ నవరాత్రి ఉత్సవాల ఏర్పాట్ల నిర్వహణ, భద్రతకు సంబంధించిన అంశాలపై గచ్చిబౌలిలోని సైబరాబాద్ కమిషనరేట్‌లో పోలీసు అధికారులు, జీహెచ్‌ఎంసీ, జలమండలి, టీఎస్ఎస్‌పీడీసీఎల్, అగ్నిమాపక శాఖ, నీటిపారుదల, రోడ్లు, భవనాలు, మెడికల్ అండ్ హెల్త్ శాఖ, రెవిన్యూ, పంచాయతీరాజ్, మున్సిపల్, పరిపాలనా విభాగం శాఖ అధికారులు, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి(బీజీయూఎస్) ప్రతినిధులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 18వ తేదీన ప్రారంభమై 28వ తేదీ వరకు కొనసాగే గణేష్ చతుర్థికి ఈ ఏడాది 1200 విగ్రహాల ప్రతిష్ఠ ఉండొచ్చని అన్నారు. నిమజ్జనం జరిగే చెరువుల వద్ద ముఖ్యంగా చిన్నారులు, మహిళలు, వృద్ధులకు ఇబ్బందులు తలెత్తకుండా జీహెచ్‌ఎంసీ సిబ్బంది, ట్రాఫిక్ సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. డయల్ 100కు వచ్చే కాల్స్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. రంగారెడ్డిజిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ మాట్లాడుతూ అన్ని శాఖలతో సమన్వయం చేసుకుంటూ పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో సైబరాబాద్ అదనపు సీపీ అవినాష్ మహంతి, ట్రాఫిక్ జాయింట్ సీపీ నారాయణ్‌నాయక్, డీసీపీలు, ఏడీసీలు, బీజీయూఎస్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ భగవంత్‌రావు, నర్సింగ్ పూరి, అధికారులు పాల్గొన్నారు.

క్రీడలకూ ప్రాధాన్యం ఇవ్వాలి

- భారత మాజీ క్రికెటర్ అంబటిరాయుడు
- హెచ్ఐసీసీలో హైబిజ్ టీవీ ఎడ్యుకేషనల్ ఎక్సలెన్స్ అవార్డ్స్– 2023 ప్రదానం



మోహన్‌రెడ్డికి అవార్డ్‌ను అందజేసిన అతిథులు

మాదాపూర్: విద్యాసంస్థలు విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని భారత మాజీ క్రికెటర్ అంబటిరాయుడు పేర్కొన్నాడు. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో సోమవారం హైబిజ్ టీవీ ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ అవార్డ్స్– 2023 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్రికెట్ క్రీడాకారుడు అంబటి రాయుడు, భారత టేబుల్ టెన్నిస్ ప్లేయర్ నైనా జైస్వాల్‌లు పాల్గొని విద్యారంగానికి చెందిన 50 సంస్థలకు అవార్డులను అందజేశారు. విద్యారంగంలో సేవలను అందించిన ముగ్గురు దిగ్గజాలకు లెజెండ్స్ అవార్డులను అందజేశారు. వీటిలో హిందీ మహా విద్యాలయ అధ్యక్షుడు సీఏ లక్ష్మీవాస్ శర్మ, సైంట్ ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ బీవీఆర్ మోహన్‌రెడ్డి, టైమ్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ మానెక్ ఎస్.దారువాలాకు అందజేశారు. కార్యక్రమంలో హైబిజ్ టీవీ ఎండి రాజగోపాల్ ,క్రెడాయి హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్ పి.కృష్ణన్, ఆదిత్య మ్యూజిక్ ఓనర్ దినేష్ గుప్తా, ఏపీ, తెలంగాణ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి.అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓటు వేయాలి

- ప్రగతి నివేదన సభలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



వేదికపై ఎమ్మెల్సీ నవీన్‌కుమార్, కార్పొరేటర్లు



కూకట్‌పల్లిలో జరిగిన సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే.. భారీగా హాజరైన ప్రజలు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని సోమవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు దంపతులు, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌లు ప్రారంభించారు. అనంతరం శ్రీలక్ష్మీ నరసింహస్వామి వ్రతం చేశారు. సాయంత్రం జరిగిన ప్రగతి నివేదన సభలో ఎమ్మెల్యే ప్రసంగించారు.

◆ ఒకప్పుడు ఏవీబీ పురం, ప్రశాంత్‌నగర్, కూకట్‌పల్లి గ్రామంలో మంచినీరు లేక ఇబ్బంది పడేవారని నేడు ముఖ్యమంత్రి కేసీఆర్ సహకారంతో కొన్ని లక్షల గ్యాలన్ల నీటి రిజర్వాయర్లు కట్టి ఆ కొరత తీర్చామన్నారు. కూకట్‌పల్లిలో 436 ఏళ్ల చరిత్ర ఉన్న రామాలయం పునర్ నిర్మాణం చేపట్టామన్నారు. అదే విధంగా చిత్తారమ్మ దేవాలయంతో పాటు మసీదు, చర్చీలకు తన వంతు సహాయం అందించి అభివృద్ధి చేశామని తెలిపారు.

◆ ఎంపీగా గెలిపించిన రేవంత్‌రెడ్డి నాలుగేళ్లుగా ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. ఎంపీ నిధులు ఎక్కడ పెడుతున్నది ఎవరికి తెలియదని ఎద్దేవా చేశారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు పరిపాలిస్తున్న రాష్ట్రాల్లో ఎక్కడైనా ఫించన్లు రూ.3వేలు ఇస్తున్నారా అని ప్రశ్నించారు. నిరుపేదల ఆడబిడ్డ పెళ్లికి 1లక్ష 116 రూపాయలు ఇచ్చిన ఘనత ఉందా అని అడిగారు.

◆ ఇప్పటికే నియోజకవర్గంలో 44వేల మందికి ఆసరా ఫించన్లు ఇస్తున్నామన్నారు. ప్రస్తుతం దరఖాస్తు చేసుకున్న వారికి మార్చి నెల నుంచి అందిస్తామని తెలిపారు. అర్హులందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తామని అందులో ఎలాంటి సందేహం లేదన్నారు. రాబోయే ఎన్నికల్లో అభివృద్ధిని చూసి ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, నియోజకవర్గంలోని కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.





ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ప్రారంభించి వ్రతంలో కూర్చున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు దంపతులు